సాక్షి రంగారెడ్డి

శనివారం। 26। ఆగస్టు। 2023



గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు అందరం కలిసి పనిచేద్దామని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. 10లో▸



మాటలు కలిపి చోరీ

పొలం పనులకు వెళ్తున్న మహిళతో బైకుపై వచ్చిన దుండగుడు మాటామాటా కలిపి పుస్తెలతాడుతో ఉడాయించాడు. 10లో▸



బీజేపీ జెండా ఎగరాలి

వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని బెంగళూర్‌ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

'పట్నం' కాంగ్రెస్ అభ్యర్థిగా నిరంజన్‌రెడ్డి దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మర్రి నిరంజన్‌రెడ్డి దరఖా స్తు చేసుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీకి చెందిన ఆయన శుక్రవారం తన అనుచరులతో కలిసి గాంధీభవన్‌లో దరఖాస్తుసమర్పించారు. ఆదిబట్ల సర్పంచ్‌గా,ఇబ్రహీంపట్నం ఎంపీపీ గా,తన భార్య మంచాల జెడ్పీటీసీగా,ఆదిబట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా పోటీచేసి గెలుపొందినట్టు చెప్పారు. అన్ని రకాలుగా విద్యార్హతలు ఉన్న తనకు ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని అదిష్టానాన్ని కోరారు.

కల్వకుర్తి నుంచి శ్రీనివాస్‌గౌడ్.



టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ నాయకులతో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీ కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. సీనియారిటీని గుర్తించి పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. నియోజకవర్గంలో పార్టీని గెలిపించేబాధ్యత తీసుకుంటానన్నారు.

'గర్జన'కు హస్తం రెడీ

- లక్ష మంది.. లక్ష్యంగా ఏర్పాట్లు
- నేడు చేవేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ
- హాజరుకానున్న ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే



సభావేదిక వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, నేతలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: చేవెళ్ల కేంద్రంగా శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ 'ప్రజాగర్జన' (ఎస్సీఎస్టీ డిక్లరేషన్) సభకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్, సరూర్‌నగర్ వేదికగా యువత డిక్లరేషన్, ఖమ్మం వేదికగా పెన్షన్ల డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్... తాజాగా చేవెళ్ల వేదికగా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు ఏర్పాట్లు చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా పలువురు ఏఐసీసీ సభ్యులు, సీడబ్ల్యూసీ మెంబర్లు, నేతలు సభకు హాజరు కానున్నారు. ఏడెకరాల విస్తీర్ణంలో ఉన్న కేవీఆర్ గ్రౌండ్‌లో భారీ సభావేదికను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి సుమారు లక్ష మందిని మీటింగ్‌కు తరలించాలని ఆ పార్టీ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించారు. మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నేతలు గౌరి సతీష్‌యాదవ్, వసంతం తదితరులు వారం రోజులుగా ఇక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రముఖులు, మహిళల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సభాస్థలితో పాటు చుట్టు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లోనూ భారీ స్క్రీన్లు, వెలుతురు కోసం లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు హన్మంతరావు, సీఎల్పీ నేత నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు సభాస్థలిని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన రహదారిపై మధ్యాహ్నం తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నట్లు ప్రకటించారు.

కదం తొక్కిన కమలనాథులు

- మీర్‌పేటలోని మంత్రి సబితారెడ్డి కార్యాలయం ముట్టడికి యత్నం
- పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య తోపులాట
- ఆందోళనకారుల అరెస్ట్
- పోలీస్ స్టేషన్‌కు తరలింపు



బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలిస్తున్న పోలీసులు

మీర్‌పేట: పార్టీ అధిష్టానం పిలుపుమేరకు చేపట్టిన మీర్‌పేటలోని మంత్రి సబితారెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడి శుక్రవారం ఉద్రిక్తంగా మారింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున మంత్రి కార్యాలయానికి తరలివెళ్లారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల పోటాపోటీ నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఘట్కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలాపూర్ చౌరస్తా నుంచి మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి ర్యాలీగా వస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో పాటు కార్పొరేటర్లు ముత్తంగి కరుణానిధి, పసునూరి భిక్షపతిచారి, ఏ.భీంరాజ్, గడ్డం లక్ష్మారెడ్డి, మీర్‌పేట బీజేపీ ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, గాజుల మధు, గడ్డం జగన్, నర్సింహయాదవ్, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆర్‌సీఐ రహదారిపై బైఠాయించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు వెంటనే ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికీ దళితబంధు, బీసీ, గిరిజన బంధు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి మీర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. క్యాంపు కార్యాలయం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మూడేళ్లలో బొంగులూరు వరకు మెట్రోరైల్

- వచ్చే యేడాది నాటికి ఫాక్స్‌కాన్ కంపెనీ పూర్తి
- అందులో 20వేల మందికి ఉద్యోగాలు
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- నియోజకవర్గంలోని దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మూడేళ్లలో ఓఆర్‌ఆర్ బొంగుళూరు వరకు మెట్రో రైల్ నిర్మాణం పూర్తి అవుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ని భారత గార్డెన్‌లో శుక్రవారం దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెట్రో రైలు నిర్మాణం జరిగితే హైటెక్ సిటీ, గచ్చిబౌలి, సికింద్రాబాద్ ప్రాంతాలకు సులువుగా వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయాన్ని పట్టుబట్టి కొంగరకలాన్ వద్ద ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఏడాదిలోపు ఫాక్స్ కాన్ కంపెనీ నిర్మాణం పూర్తవుతుందని, అందులో సుమారు 20 వేల మందికి ఉపాధి లభించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 36,445 మందికి పింఛన్ల రూపంలో రూ. 8.48 కోట్లు, 5,688 మంది దివ్యాంగులకు 2.38 కోట్లు ప్రతి నెలా ఇస్తున్నట్లు తెలిపారు. నా పెద్ద కుమారుడు దివ్యాంగుడేనని.. అతన్ని పలకరించి బయటకు వెళితే అన్ని విజయాలే కలుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో దివ్యాంగుల భవన నిర్మాణాలకు రూ. 10 లక్షల చొప్పున ఇబ్రహీంపట్నంలో భవన మరమ్మతులకు రూ. 3 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, కమిషనర్ రవీంద్ర సాగర్, ఎంపీడీఓలు వెంకటమ్మ, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పట్నం మహేందర్‌రెడ్డి
- చేవెళ్లలో బీసీబంధు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. గనులు, సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 300 మంది లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అన్ని కులవృత్తులను ఆర్థికంగా అభివృద్ధి చేయటంతోపాటు వారికి చేయుతనందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దళితులకు దళితబంధులానే ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బీసీలకు బీసీ బంధు, మైనార్టీలకు మైనార్టీ బంధును అందించే ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలుస్తోందన్నారు. బీసీబంధు అనేది నిరంతరంగా కొనసాగుతుందని, ప్రతీ నెల 15న ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్‌కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.









ఏఐసీసీ కార్యదర్శి చల్లాకు ఘన స్వాగతం



వంశీచంద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. సీడబ్ల్యూసీలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నికై మొదటిసారి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి పలువురు నేతలు వంశీచంద్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జ్ అజీం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కృష్ణయ్య, చెన్నకేశవులు, అనిల్, రమేష్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'బ్లూ కోట్స్'

- మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి ఆస్పత్రిలో చేర్చిన పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం బ్లూకోట్స్ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళుతూ కింద పడ్డాడు. గాయలైన ఆ వ్యక్తిని గమనించి బ్లూకోట్స్ కానిస్టేబుల్ జగన్, హోంగార్డు అయిలయ్య చేరదీశారు. అంబులెన్స్‌లో ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసుల సేవను చూసి ప్రయాణికులు, యాచారం ప్రజలు శభాష్ పోలీస్ అంటున్నారు.



మతిస్థిమితం లేని వ్యక్తిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

నేడు మంత్రి తలసాని పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించనున్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం చేపట్టిన ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి శేరిగూడలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఫిష్ మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. అనంతరం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో చేప, రొయ్య పిల్లలను విడుదల చేస్తారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి
- మొయినాబాద్‌లో ఘన స్వాగతం

మొయినాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు అందరం కలిసి పనిచేద్దామని రాష్ట్ర సమాచార, భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో బీసీ బంధు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వెళ్తున్న ఆయనకు మొయినాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్, మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, మాజీ వైస్ చైర్మన్ రాజు, సర్పంచులు స్వరూప, నరోత్తంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎంపీటీసీ అర్జున్, నాయకులు జయవంత్, వెంకటేష్, రవీందర్, జగన్‌మోహన్‌రెడ్డి, రాఘవేందర్ యాదవ్, బిలాల్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం రూరల్: సమాచార, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న పట్నం మహేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట యాచారం మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

ఘన స్వాగతం

చేవెళ్ల: పట్టణంలో శుక్రవారం మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మంత్రి చేవెళ్లలోని అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాలకు పూల మాలలు వేశారు. అనంతరం స్వర్గీయ పట్నం రాజేందర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేశారు. చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కృష్ణారెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీకాంత్, మానిక్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రాంచంద్రయ్య, శ్రీకాంత్, ప్రభాకర్, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

మాటలు కలిపి పుస్తెల తాడు చోరీ

కొత్తూరు: ఒంటరిగా పొలం పనులకు వెళ్తున్న మహిళను బైకుపై వచ్చిన దుండగుడు ఇక్కడ ఖాళీ ప్లాట్లు ఉన్నాయా..? అంటూ మాటలు కలిపాడు. ఆమెను నమ్మిస్తూ నెమ్మదిగా దగ్గరికి వెళ్లి మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కున్నాడు. బాధితురాలు అరవడంతో బైకుపై పరారయ్యాడు. ఈ సంఘటన మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అమృత(55) కాలి తమ పొలానికి బయలుదేరింది. ఒంటరిగా వెళ్తున్న ఆమెను ఓ వ్యక్తి బైకుపై అనుసరించాడు. మహిళ పొలం వద్దకు చేరుకోగానే ఇక్కడ అమ్మకానికి ఏమైనా ఖాళీ ప్లాట్లు ఉన్నాయా..? అంటూ మాటలు కలుపుతూ దగ్గరకు వచ్చాడు. నాకు తెలియదు అని పొలం వద్ద ఉన్న గేటును తెరుస్తుండగా వెనుక నుంచి దుండగుడు ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని బైకుపై పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రామచందర్, సీఐ శంకర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.



ఘటన స్థలంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

ఇద్దరు దుర్మరణం



శేఖర్, చరణ్ మృతదేహాలు

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డ తండా గేటు వద్ద శుక్రవారం బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లుకు చెందిన శేఖర్(20), చరణ్(36) ద్విచక్ర వాహనంపై అచ్చంపేటకు బయలుదేరారు. మండలంలోని మేడిగడ్డ తండా గేటు వద్దకు రాగానే కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళుతున్న టిప్పర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్, చరణ్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు ఏఎస్ఐ బాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇదే సమయంలో అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళుతున్న ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల బంధువు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ బంధువులు ఆమనగల్లు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించారు.

ప్రేమపేరుతో బాలికపై లైంగిక దాడి

వ్యక్తి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన శుక్రవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్‌కు చెందిన బాలిక(16)ను ప్రేమ పేరుతో నరేష్(22) లోబర్చుకున్నాడు. రెండు రోజుల క్రితం తుర్కయంజాల్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నిందితుడు నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మునగాల(కోదాడ): నగరంలోని బాలాపూర్ మండలం సాయినగర్‌కు చెందిన దేరంగుల శివకుమార్ శుక్రవారం సూర్యాపేట జిల్లా మండల కేంద్రమైన మునగాల శివారులో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శివకుమార్ వృత్తిరీత్యా డ్రైవర్. ఐదు నెలల క్రితం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తుర్కగూడకు చెందిన నవీనతో వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య నవీన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపానికి గురైన శివకుమార్ గురువారం తన ద్విచక్ర వాహనంపై ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో శివకుమార్ తల్లి మీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా.. శివకుమార్ నిద్రమాత్రలు మింగి మునగాల శివారులో పెట్రోల్ బంక్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు 108, 100కు డయల్ చేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని శివకుమార్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని జేబులో తాను భార్య మీద కోపంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చీటి రాసి ఉంది. దీంతో పోలీసులు బాధితుడి తల్లికి ఫోన్ చేసి సమాచారం అందించారు. శివకుమార్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

మహేశ్వరం గడ్డపై బీజేపీ జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి సుబ్రహ్మణ్యం

- బెంగళూరు ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం
- మన్సాన్‌పల్లి చౌరస్తాలో ప్రవాస్ యోజన సమావేశం

మహేశ్వరం: వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని కర్ణాటక రాష్ట్రం బెంగళూర్ ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మన్సాన్‌పల్లి ఎస్‌కేఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మోస పూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. రేషన్ కార్డులు, నిరుద్యోగులకు భృతి ఇవ్వలేదన్నారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, ఇతర పరికరాలు ఇవ్వడం మానేసిందన్నారు. మరో సారి ప్రజలను మోసం చేయడానికి సీఎం కేసీఆర్ ఉచిత హామీలు ఇస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని, ఆ పార్టీలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరంలో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సుధాకర్ శర్మ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు టి.యాదిష్, పార్టీ మండల అధ్యక్షుడు మాధవాచారి, సీనియర్ నాయకులు యాదయ్య గౌడ్, నందీశ్వర్, సుదర్శన్ యాదవ్, భూపాల్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఆరోపించారు. శుక్రవారం యాచారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమన్నారు. యాచారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తూతూ మంత్రంగా నిధులు కేటాయించి చేతులు దులుపుకొన్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా ఎలాంటి మార్పు లేదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, హతిరామ్, నర్సింగ్, రాము, రాహుల్, రాంబాబు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నా బలం, బలగం మీరే

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నా బలం.. నియోజకవర్గ ప్రజలు నా బలగం అని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ అసెంబ్లీ స్థానానికి శుక్రవారం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే వారికి సేవకుడిగా పని చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే నన్ను గెలిపిస్తాయన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు.



షాద్‌నగర్ అసెంబ్లీ స్థానానికి దరఖాస్తు చేసుకుంటున్న వీర్లపల్లి శంకర్